## మినీకథ

# నిజమైన శత్రువులు

ఇదిగో భానూ! మా యింట్లో రెండు పూటలా గిన్నెలు తోమటం, వీధి వూడ్చి నీళ్ళుజల్లి ముగ్గుపెట్టటం. ఇంతకు మించి వేరే పనేమీ వుండదు. ఒక వేళ అదనంగా మేము పని చెప్పినా, ఆ కష్టానికి మేము నీ ఋణం వుంచు కోము."

"ఉదయం ఎనిమిదిన్నర అయేసరికి మా పిల్లలు కేరియర్లతో సహా సిటీ బస్సులో వుండాలి. ఇందుకు ఇష్టమైతే రేపటినుంచి పనిలోనికి రా. ఉదయమే నీకు పనిలోకి రావటం కుదరకపోతే ఆ విషయం ముందుగానే చెప్పెయ్యి, మేము మరొక మనిషిని మాట్లాడుకుంటాం." అంది రాంబాయమ్మ పనివేళలు - పనులు గురించి చెప్పి.

"అలాగేనమ్మా! మీ యిల్లు చేసిన తర్వాతనే మిగతా యిళ్ళు చేసుకుంటాను" అంది భాను

రాంబాయమ్మగారిది గ్రౌండు ఫ్లోరు. ఆపై ఫ్లోరులో బాబూరావుగారు వుంటు న్నారు. బాబూరావుగారి భార్య కమలమ్మ కూడా భానుని పనికి కుదుర్చుకుంది.

భానుకి, కమలమ్మకు ఒక ఒప్పందం కుదిరింది. రాంబాయమ్మగారిల్లు చేయందే పైకి రావటం కుదరదంది భాను. రాంబాయమ్మగారిల్లు చేయటం అయిన తర్వాత ఏడు ఏడున్నర మధ్య వచ్చినా ఫరవా లేదంది కమలమ్మ

పని మనుషులకు నాలుగిళ్ళు ఒక దగ్గర కుదరటం లాభసాటిగా వుంటుంది

భాను రాంబాయమ్మగారు చెప్పినట్లుగా ముందు రాంబాయమ్మగారిల్లు చేసేది. ఆపైనే కమలమ్మగారింటికివెళ్ళి కమలమ్మ గారిల్లు చేసేది.

అయితే ఒక్కోసారి రాంబాయమ్మగారింటికి వెళ్ళటంలేటయితే-భాను కమలమ్మ గారింటికి వెళ్ళేసరికి మరింత లేటయేది. ఇలా లేటయిన నాడు ఒకటికి రెండు, రెండుకి నాలుగుసార్లు కమలమ్మగారు వాళ్ళబ్బాయి చేత కిందకి కబురుపెట్టేది భాను కోసం.

ఇలా నాలుగయిదు సార్లు లేటయి ఏడున్నర, ఎనిమిది అయేది భాను పైకి వెళ్ళే సరికి.

ఓ సారి ఇలా లేటయి భాను పైకి వెళ్ళే సరికి కమలమ్మగారు భాను మీద విరుచుకు పడిపోయింది, ప్రళయకాల రుద్రుడి అర వెర్షనులా.

"నేను ముందే చెప్పాను కదమ్మా! కిందిల్లు చేయందే పైకి రావటం కుదర దని". భాను సమాధానం కమలమ్మగారికి అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది.



"కిందవాళ్ళ గొడవ నాకనవసరం. నీకూ, నాకూ మధ్యకూడా ఒక ఒప్పందం వుంది. అది మర్చిపోతున్నావు. అదేమిటంటే ఏడు ఏడున్నర మధ్య మా ఇంటికి వస్తానన్నావు. ఆ టైముకి నువ్వురావటం లేదు. మన ఒప్పందం ప్రకారం. ఆ టైముకి నువ్వు మా యింటికి రావాలి." అంది కమలమ్మ ఆజ్ఞాపిస్తున్నట్లుగా.

"కింద ఆలస్యమయితే పైన ఆలస్యమవుద్దమ్మా!" భాను అదేమాట రెట్టించింది.

కమలమ్మ "అహం" రెచ్చిపోయింది భాను సమాధానంతో.

"ఇదిగో భానూ! నీకూ, నాకూ మధ్య గొడవ అనవసరం. ఈ నెలనుంచీ నీకు మరో రెండు రూపాయలు జీతం పెంచుతాను, రెండు పూటలా టీ యిస్తాను. సినిమాకు డబ్బులిస్తాను నెల నెలా. ముందు మా యింటికివచ్చి చేసెయ్యి." అంది భాను నిజాయితీకి పరీక్ష పెడుతూ. ముందు రాంబాయమ్మగారిల్లు మానిపించటానికి ఎత్తు ఎత్తి. అహాన్ని దర్పాన్ని ప్రదర్శిస్తూ, వెంటనే రంగువెలిసిపోయి పాతదయిన నైలక్సుచీర ఒకటితెచ్చియిచ్చింది భానుకి దర్పంగా.

ఈ లోకంలో డబ్బుకి మించిన నిజాయితీ ఏముంటుంది! ముఖ్యంగా నలుగురు పిల్లల తల్లి అయిన భానులాంటి పని మనిషికి మరో రెండు రూపాయలు వచ్చినా రావటమే. రెండుపూటలా "టీ" కూడా మామూలు విషయం కాదు.

భాను నిజాయితీ ఓడిపోక తప్పలేదు.

"ఇదేమిటి భానూ! ఇలా ఎందుకు చేశావు?" అంటూ రాంబాయమ్మ కొంత కోపంగానూ, కొంత బాధతోనూ అడిగింది జరిగినదానికి.

"మీరూ జీతం పెంచండమ్మా...." అంది ఇంక ఏమీ అనలేని భాను.

"పనినిబట్టి జీతముంటుందెప్పుడూ! అది నీవే తెలుసుకుంటావు క్రమంగా." అంటూ లోపలకువెళ్ళి భానుకు రావలసిన డబ్బు లెక్కకట్టి యిచ్చేసింది రాంబాయమ్మ.

కమలమ్మ 'అహం' 'తృప్తి' పడింది. శాంతించింది.

పెంచిన జీతానికి, ఇచ్చిన పాత చీరకి రెండుపూటలా పోసే 'టీ'కి కమలమ్మ పనులు కూడా అదనంగా పెంచింది. రోజూ ఇల్లు తడిగుడ్డతో అద్దాలి. బట్టలు వుతకాలి. వేడి నీళ్ళ పొయ్యి అంటించి వేడినీళ్ళు కాయాలి. పప్పులు, బియ్యాలు మిల్లుకి పట్టుకెళ్ళి ఆడించాలి.

భానుకి మొదట ఈ పనులు మామూలుగా అనిపించినా. క్రమంగా ఈ పనులు చేయడానికి విసుగూ, అలసటా కూడా వచ్చేయి.

క్రమంగా కమలమ్మగారింటికి ఏడున్నర, ఎనిమిది అయేసరికి రావటం మొదలుపెట్టింది భాను. అంతే కాదు— ఒక్కొక్కప్పుడు ఎనిమిదీ - తొమ్మిది మధ్య కూడా అయిపోయేది భాను రావటం.

అయితే ఇదివరకు ఏడున్నర అయేసరికి భాను రాకపోతే, కిందకి నాలుగుసార్లు కబురుపెట్టే కమలమ్మ ఇప్పుడు భాను తొమ్మిదికివచ్చినా నిశ్చింతగా వుండగలుగుతోంది.

రాంబాయమ్మగారికి కొత్త పనిమనిషి కుదరలేదు. ఆవిడ తెల్లవారుఝామున లేచి గిన్నెలు తోముకుంటున్నప్పుడల్లా—

"నిజమైన శత్రువులు ఇరుగు పొరుగు వారే" అనుకుంటూ వుంటుంది. ●

ఎ. రంగ